ఈ నెల 20న సినీ నటుడు శోభన్‌బాబు చిత్ర గీతాలాపన

రవీంద్రభారతి, మార్చి 17 : అందాల నటుడు శోభన్‌బాబు దివ్య స్మృతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సీల్‌వెల్ కార్పొరేషన్-ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 10గంటల వరకు చిత్రగీతాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పాల్గొని ప్రసంగిస్తారని సీల్‌వెల్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ చైర్మన్ బొక్క భీంరెడ్డి, శృతిలయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి(అమని)తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొన పలువురు మహిళలను సత్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం నవరస గాయని ఆమని బృందంచే శోభన్‌బాబు సినీ సుస్వరాల-52 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నటభూషణ్ శోభన్‌బాబు అభిమానులు, కళాప్రియులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

'సూపర్ సీనియర్ సిటిజన్స్' పురస్కారాలకు దరఖాస్తులు

అమీర్‌పేట్, మార్చి 17 : సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రత్యేకత చాటుతున్న వయోధికులకు 'సూపర్ సీనియర్ సిటిజన్స్' పేరుతో ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు నిర్వాహకులు జేఎస్‌టీ సాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో 60 నుంచి 80 ఏండ్ల మధ్య వయసు ఉండి స్వచ్ఛందంగా సామాజిక సేవా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వయోధికులు ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులను పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440894873 (జేఎస్‌టీ శాయి), 9491117461 (డి.పార్థసారథి), 9866520761 (ఆర్‌సీ కుమార్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

• నేటి నుంచి వచ్చే నెల 2 వరకు పరీక్షలు

మారేడ్‌పల్లి, మార్చి 17: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మారేడ్‌పల్లి డిప్యూటీ ఈఓ బాలూనాయక్ తెలిపారు. మారేడ్‌పల్లి జోన్ పరిధిలో 33 పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు వచ్చే నెల 2 వరకు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఇందు కోసం అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైయ్యే అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. 11 ప్రభుత్వ పాఠశాలలు, 3 ఎయిడెడ్, 19 ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షలు జరుగనున్నాయన్నారు. జోన్ పరిధిలో మొత్తం 5,462 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరిలో 2,669 మంది బాలురు, 2793 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులంతా 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



కీస్ హైస్కూల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బోర్డు

పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

బన్సీలాల్‌పేట్ పరిధిలో...

బన్సీలాల్‌పేట్ : సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి ఎస్.చిరంజీవి తెలిపారు. తమ మండలంలో 13 కేంద్రాల్లో 2,600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకుని రావద్దని, తరగతి గదుల్లో సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని, ఎలాంటి మాల్ ప్రాక్టీసు జరుగకుండా తనిఖీలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జాతి నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

• మంత్రి పొన్నం ప్రభాకర్

అమీర్‌పేట్, మార్చి 17 : భవిష్యత్ భారతావని నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీకే గూడలోని హైదరాబాద్ సెంట్రల్ స్కూల్ (పూర్వ వశిష్ట స్కూల్) వార్షిక వేడుకలు ఆదివారం ససనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్కూల్ చైర్మన్ ఎన్‌వీ రమణబాబు, డైరెక్టర్ ఎన్‌ఎస్‌బీ ఆదిత్యతో కలిసి పాఠశాల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా వారిలో అంతర్లీనంగా నాయకత్వ, క్రీడా, సాంస్కృతిక, సామాజిక అంశాల పట్ల ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, కేతినేని సరళ, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సెంట్రల్ స్కూల్ వార్షిక వేడుకల్లో పాల్గొని ప్రసంగిస్తున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన గెస్ట్ లెక్చరర్లు

సికింద్రాబాద్,మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ప్రభుత్వ డిగ్రీ ఇంటర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్లు ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమకు ఆటో రెన్యూవల్, కన్సాలిడేటెడ్ పేతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నరేందర్‌రెడ్డి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రభుత్వం ద్వారా పరిష్కారం చూపేందుకు యత్నిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర ఈశ్వర్‌లాల్, వేణుగోపాల్‌రెడ్డి, కరుణాకర్, లెక్చరర్స్ కిశోర్, నాయక్, వెంకటేశ్వర్లు, ఇంటర్ గెస్ట్ లెక్చరర్స్ శ్రీధర్ ఆచారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను ఖండిస్తున్నాం..

కవాడిగూడ, మార్చి 17 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీం ద్ర కోక, భోలక్‌పూర్ మైనారిటీ సెల్ నాయకుడు జునేద్ బాగ్దాది అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు భోలక్‌పూర్‌లో ఏ ర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వెంటనే కవితను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ జగన్, గడ్డం ప్రవీణ్, కృష్ణ, ఆంజనేయులు, కొమ్ము రాజేశ్, శ్యామ్, రాజమౌళిగౌడ్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికం'

అబిడ్స్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా అన్నారు. బీఆర్ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేసే కుట్రలో భాగంగా ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. ఆమెకు ప్రజలు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారని తెలిపారు.

సాయిబాబా మందిరం కమిటీ అధ్యక్షుడిగా మహేశ్

మహేశ్‌ను అభినందిస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

బన్సీలాల్‌పేట్, మార్చి 17 : న్యూబోయిగూడలోని సాయిబాబా మందిరం కమిటీ నూతన అధ్యక్షుడిగా బి. మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివా రం జరిగిన సమావేశం లో ఎన్నికల పరిశీలకులు ఈ.చంద్రశేఖర్, లంక బాబాన్న, కే.సతీశ్, పి.మహేందర్, రాజ్‌కుమార్, రాజేందర్, సాయికృష్ణ, క్రాంతి, న్యాయవాది మల్లికార్జున్, ఎస్‌వై.గిరి, అడ్‌హక్ కమిటీ సభ్యులు, పాత కమిటీ సభ్యుల సమక్షంలో మహేశ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని నియమిస్తామని, దేవాలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో చేస్తామని తెలిపారు.

గండిమైసమ్మ ఆలయంలో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు

వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎంసీఆర్ ప్రజాసేవ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌రావు

అడ్డగుట్ట, మార్చి 17 : చిలకలగూడ చౌరస్తాలోని గండిమైసమ్మ ఆలయంలో మ్యాకల చంద్రశేఖర్‌రావు(ఎంసీఆర్) ప్రజాసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఆదివారం ప్రజాసేవ ప్రతినిధులతో కలిసి ఆయన వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. గండిమైసమ్మ తల్లిని దర్శించుకోవడానికి నిత్యం అనేక మంది భక్తులు వస్తుంటారని, వారి కోసం వేసవిలో తాగునీటి వసతిని కల్పించినట్లు తెలిపారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, అంబలి పంపిణీ

పాదచారులకు అంబలి పంపిణీ చేస్తున్న స్కై ఫౌండేషన్ సభ్యులు

బన్సీలాల్‌పేట్, మార్చి 17 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్ల పక్కన ఉంటున్న నిరాశ్రయులు, అనాథలకు దుస్తులు, పాదచారులకు అంబలి, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవిలో నగరంలో ఎండలు తీవ్రంగా ఉండడంతో తాము ప్రతి ఆదివారం అంబలి పంపిణీ చేస్తామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై. సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. సభ్యులు శుభం, సాయికిరణ్, సిద్ధార్థ్, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ డివిజన్‌లోని ఓవైసీ మైదానంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఆదివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ. నసీరుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు.

– మెహిదీపట్నం మార్చి 17

'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, తదితరులు

చిక్కడపల్లి, మార్చి 17 : మాతృక ప్రచురణలు, పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రచయిత మౌమితా ఆలం కవితలను తెలుగు అనువాదం పుస్తకం 'రాయగూడని పద్యం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీవోడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, కవయిత్రి విమల, రమాసుందరి, పుష్పల శ్రీరామ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఉన్నతిని సాధించాలి

కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తుల వారి స్వయం ఉపాధి కోసం కల్పిస్తున్న అవకాశాలను యువత, మహిళలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కార్వాన్ జన జాగరణ వేదిక ప్రతినిధులు అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతినిధులు యువతకు అవగాహన కల్పించారు.

– కార్వాన్, మార్చి17

శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 17: సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆవరణలో మాతృదేవోభవ శీర్షికన నిర్వహించిన కార్యక్రమంలో నృత్య గురువు రేణుకా ప్రభాకర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని ఏపీ ప్రాథమిక విద్య కమిషన్ పర్యవేక్షకుడు జస్టిస్ ఎ. రామలింగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై సత్కరించారు. సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ దేవసేన, పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మన్ సి. హెచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

కాచిగూడ,మార్చి 17: దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు కేంద్రం తీసుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్న బీసీ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీసీల సమగ్రాభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు, కుల వృత్తుల వారికి సబ్సిడీ రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కృష్ణ, కిశోర్, మాణిక్‌రావు, పాల్గొన్నారు.

రాందాస్ అగర్వాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కవాడిగూడ, మార్చి 17: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వ్యవస్థాపకుడు దివంగత రాందాస్ అగర్వాల్ ఆశయ సాధనకు వైశ్యులంతా కృషి చేయాలని ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. రాందాస్ అగర్వాల్ జయంతి సందర్భంగా ఆదివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ భవనంలో వైశ్య ఏక్త దివస్ కార్యక్రమం నిర్వహించారు. రాందాస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

భగత్‌సింగ్ ఆశయాలు సాధించాలి

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2కే రన్

సికింద్రాబాద్, మార్చి 17 : భగత్‌సింగ్ యువజన ఉత్సవాల్లో భాగంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం ఓయూ ఎన్‌సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు 2కే రన్ నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేశ్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2కే రన్ ముఖ్య ఉద్దేశం సే నో టు డ్రగ్స్ అని పేర్కొన్నారు. దేశంలో దశాబ్ద కాలంలో యువత మాదకద్రవ్యాలు, మద్యం మత్తుకు బానిసలై బంగారు జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు గంజాయి, మత్తు పదార్థాలతో వ్యాపారం చేసే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజమైన దేశభక్తుడు భగత్‌సింగ్ ఆశయాలను,ఆలోచనలను యువత స్ఫూర్తిగా తీసుకొని విద్య, ఉపాధి కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మాజీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, జావెద్, అశోక్‌రెడ్డి, రవినాయక్, శ్రీకాంత్, పవన్, కళ్యాణ్, ప్రశాంత్, శ్రీధర్, శ్రీమన్, స్టాలిన్, ఆజాద్, మహేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేయాలి

• ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్‌లో పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 17: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ ప్రధాన మార్గంలో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం పరిశీలించారు. డ్రైనేజీ పైపులైన్ పనులు చేపడుతున్న తీరును వాకబు చేసి తెలుసుకున్న ఆయన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రధాన మార్గంలో డ్రైనేజీ పైపులైన్ శిథిలావస్థకు చేరడంతో గత ఏడాదిన్నర కాలంగా మురుగు నీటి లీకేజీ సమస్య తలెత్తుతుందని, ప్రత్యేక చొరవ తీసుకొని ఇటీవల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ అస్లాం, సురేందర్, వెంకట్‌రామ్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి జాతీయ బ్యాంక్‌గా చేయాలి

చిక్కడపల్లి, మార్చి17 : దేశంలో ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పాటు చేయాలని ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్. వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశా రు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏపీజీవీబీ ఈయూ మాజీ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కారింగు భిక్షమయ్య ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. గ్రామీణ బ్యాంకుల్లో పనిచేసే ఉగ్యోగులకు వాణిజ్య బ్యాంకులకు ఉద్యోగులకు వ్యత్యాసం లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా భిక్షమయ్యను సన్మానించారు. ఎపీటీఆర్ఆర్ఈఎ అధ్యక్షుడు బి.రవికాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి, ఎపీజీవిబిఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వేణురావు, రాజు, కె.కె. మక్కడ్, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

'బీసీల హక్కులను కేంద్రం అణచివేస్తుంది'

విజయ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ

కాచిగూడ, మార్చి 17: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జి.విజయ్‌కుమార్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని ఆర్.కృష్ణయ్య అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు లేకపోవడంతో బీసీలు అన్ని రంగాల్లో వెనుబడి ఉన్నారని ఆరోపించారు. బీసీలకు రావాల్సిన రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, నందగోపాల్, రాజ్‌కుమార్, రామకృష్ణ, జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకమర్తికి ఘన నివాళి

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

ముషీరాబాద్, మార్చి 17: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని చిలకమర్తి లక్ష్మీనరసింహం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంకర నారాయణ, తంగిరాల చక్రవర్తి, పబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ అదృశ్యం

అంబర్‌పేట,మార్చి 17: ఇంట్లోంచి బయటకు వెళ్లిన బిల్డర్ అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.జగదీశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట ప్రాంతానికి చెందిన బండి ప్రవీణ్‌కుమార్(51) బిల్డర్. ఈ నెల 14 సాయంత్రం ఇంట్లోంచి వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

ఖైరతాబాద్, మార్చి 17 : రాజ్యాధికారం దిశగా కాపులు అడుగులు వేయాలని కాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కాపుల ఓట్లు 1.42 కోట్లు ఉంటాయని, పార్టీల గెలుపోటములను నిర్ణయించే సత్తా ఉంటుందన్నారు. తమ ఓట్లతో గద్దెనెక్కుతున్న నేతలు ఎన్నికల తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో కాపు నాయకులకు అండగా నిలబడాల్సిన ముద్రగడ పద్మనాభం వైఎస్ఆర్‌సీపీ చెంతన చేరడం బాధాకరమన్నారు.